కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: మేడ్చల్ సబ్‌స్టేషన్ పరిధిలోని కంట్రీ క్లబ్ ఫీడర్‌లో చెట్ల కొమ్మల నరికివేత కారణంగా మంగళవారం పట్టణ పరిధిలో పలు కాలనీల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏఈ శశిధర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని సాయిబాబానగర్, ఎయిర్‌ఫోర్స్ కాలనీ, వీకర్ సెక్షన్ కాలనీ, రైల్వే స్టేషన్ రోడ్డు, ఏకలవ్యనగర్, ఎస్‌వీఆర్ కాలనీ, కటికె బస్తీ, హరిజనవాడ, సరస్వతినగర్, ఎల్లమ్మతోట, మెట్రో ల్యాండ్, శివాలయం ప్రాంతం, గిర్మాపూర్ రోడ్డు, ఎంపీడీఓ కార్యాలయం రోడ్డు, గిర్మాపూర్ రోడ్డు, ఎల్‌బీనగర్ తదితర కాలనీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

సమస్యలపై కేఎల్‌ఆర్‌తో సమావేశం



మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

శామీర్‌పేట్: మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్‌ను కాంగ్రెస్ మూడుచింతలపల్లి మండల నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తుక్కుగూడలోని ఆయన నివాసంలో కలిసిన నాయకులు మేడ్చల్ నియోజకవర్గంలోని పలు సమస్యలు, అంశాలపై చర్చించినట్లు తెలిపారు. వేణుగోపాల్‌రావు, రాజేంద్రప్రసాద్ గౌడ్, రాంప్రభాకర్‌రెడ్డి, జెర్రిపోతుల నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

తందూర్ రెస్టారెంట్ నుంచి వచ్చే మురుగుతో ఇబ్బందులు



శామీర్‌పేట్: తందూర్ రెస్టారెంట్ నుంచి వెలువడుతున్న వ్యర్థాలతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తూంకుంట మున్సిపాలిటీ, దొంగలమైసమ్మ చౌరస్తాలో గల తందూర్ రెస్టారెంట్ వద్ద గల మ్యాన్‌హోల్ పొంగిపొర్లుతూ రోడ్డుపై మురుగు పారుతోంది. దీంతో దుర్వాసన వెదజల్లుతుండటంతో ప్రయాణికులు, వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. హోటల్ యాజమాన్యం, మున్సిపల్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

కోతులు, కుక్కల నుంచి కాపాడాలని వినతి



ఎంపీపీ, ఎంపీఓకు వినతి అందజేస్తున్న శ్రీశైలం, కుమార స్వామి

ఘట్‌కేసర్: ఎదులాబాద్ గ్రామంలో కోతులు, కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడాలని కోరుతూ బీజేపీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, గ్రామ ప్రత్యేక అధికారి, ఎంపీఓ నందకిశోర్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. కోతులు, కుక్కలతో ఇబ్బందులు పడుతున్నామని లేఖలో తెలిపారు. ఎండలకు కుక్కలు మరింత రెచ్చిపోయే అవకాశం ఉందని అన్నారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, గ్రామశాఖ అధ్యక్షుడు కుమారస్వామి, చిరంజీవి వినతి అందజేసిన వారిలో ఉన్నారు.

యువతి అదృశ్యం



జమున (ఫైల్)

మేడ్చల్‌రూరల్: ఆశ్రమం నుంచి బయటకు వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన మేడ్చల్ పట్టణంలో చోటుచేసుకుంది. సీఐ నర్సింహారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ పట్టణంలోని ఉమానగర్ కాలనీలోని మనో వికాస వృత్తి శిక్షణ కేంద్రంలో ఉంటున్న సికింద్రాబాద్‌కు చెందిన జమున(19) సోమవారం ఉదయం 6 గంటల సమయంలో కేంద్రం నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కేంద్రం ఇన్‌చార్జి, సిబ్బంది చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో మేడ్చల్ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మేడ్చల్ బాలాజీనగర్‌లో..



నందిని (ఫైల్)

మేడ్చల్‌రూరల్: యువతి అదృశ్యమైన ఘటన సోమవారం మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ బాలాజీనగర్‌లో నివాసం ఉండే నందిని(18), ఓ ప్రైవేటు జాబ్ చేస్తోంది. ఈ నెల 11న మధ్యాహ్నం సమయంలో టైలర్ షాప్‌నకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో సోమవారం మేడ్చల్ పోలీసులను ఆశ్రయించారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తిని ఢీకొట్టిన గుర్తు తెలియని వాహనం

మేడ్చల్‌రూరల్: రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఓ గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. వివరాలు.. మేడ్చల్ సూర్యనగర్‌కు చెందిన వంగలి నాగరాజు టైల్స్ వర్క్ చేస్తుంటాడు. సోమవారం మధ్యాహ్నం మేడ్చల్ బస్టాప్ సమీపంలోని పబ్లిక్ టాయిలెట్స్ వద్ద నుంచి రోడ్డును దాటుతుండగా తూప్రాన్ వైపు నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టి వెళ్లిపోయింది. ప్రమాదంలో నాగరాజుకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం నగరంలోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసి వాహనం ఆచూకీ కోసం సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

నకిలీ విలేకరి అరెస్టు

మేడ్చల్‌రూరల్: విలేకరి పేరుతో అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తిని మేడ్చల్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. మండల పరిధిలోని సైదోనిగడ్డకు చెందిన రైతులు ఆటోలో బియ్యం బస్తాలతో వెళ్తుండగా అల్వాల్‌కు చెందిన అంథోని సుందర్‌రాజ్ అనే వ్యక్తి వారిని వెంబడిస్తూ ఎల్లంపేట చౌరస్తా వద్ద నిలిపివేశాడు. ఒక పత్రిక, వెబ్ ఛానల్ గుర్తింపు కార్డు లోగో చూపిస్తూ రూ.లక్ష ఇవ్వాలంటూ డిమాండ్ చేశాడు. దీంతో బాధితులు మేడ్చల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎన్నికల బదిలీలు..!

- లోక్‌సభ ఎన్నికలకు ప్రారంభమైన సన్నాహాలు
- కొనసాగుతున్న మొదటి విడత ఈవీఎంల తనిఖీ
- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఓటర్ల తుది జాబితా విడుదల



సాక్షి, మేడ్చల్ జిల్లా: లోక్‌సభ ఎన్నికలకు సన్నాహాలు కొనసాగుతున్న వేళ.. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఎన్నికల బదిలీల ప్రక్రియ మొదలైంది. శాసనసభ ఎన్నికల సమయంలోనే బదిలీలు చేపట్టాల్సి ఉండగా కేవలం తహసీల్దార్ల వరకు మాత్రమే నిర్వహించారు. ఈసారి పలు శాఖల్లో పెద్దఎత్తున బదిలీలు జరుగుతున్నాయి. జిల్లా అధికార యంత్రాంగం ఇప్పటికే ఒకేచోట మూడేళ్లు పైబడిన, జిల్లా ఆవిర్భావం నుంచి ఇక్కడే పాతుకుపోయిన ఉద్యోగుల వివరాలతో నివేదిక ప్రభుత్వానికి పంపించిన విషయం తెల్సిందే. దీంతో బదిలీల ప్రక్రియ జోరందుకుంది. ఆదివారం ముగ్గురు ఎంపీడీవోలను రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలకు పంపించారు. డీఆర్డీవో, పంచాయతీరాజ్, రెవెన్యూ, ఆబ్కారీ, పోలీసు తదితర శాఖల్లో దీర్ఘకాలికంగా, స్థానికులై ఉండి పనిచేస్తున్న ఉద్యోగులకు స్థానచలనం కల్పించారు. ఇతర జిల్లాల నుంచి డిప్యూటేషన్లపై వచ్చిన వారిని కూడా వెనక్కి పంపించడానికి అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది.

జోరందుకున్న బదిలీలు..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో బదిలీలు జోరందుకున్నాయి. జిల్లా పరిషత్ సీఈఓ దేవసహాయం నాగర్‌కర్నూల్ జిల్లాకు జెడ్పీ సీఈఓగా బదిలీ కాగా, ఈయన స్థానంలోకి రంగారెడ్డి జిల్లాకు చెందిన జెడ్పీ సీఈఓ దిలీప్‌కుమార్‌ను బదిలీ చేశారు. అలాగే మేడ్చల్ జిల్లా జెడ్పీ డిప్యూటీ సీఈఓ సరిత జనగామ జిల్లాకు బదిలీ కాగా, ఆమె స్థానంలోకి రంగారెడ్డి జిల్లా జెడ్పీ డిప్యూటీ సీఈఓ నీరజను బదిలీ చేశారు. డీఆర్‌డీఏ పద్మజారాణి కామారెడ్డి జిల్లా డీఆర్‌డీఏగా బదిలీ కాగా, ఆమె స్థానంలోకి వెయిటింగ్‌లో డిప్యూటీ సీఈఓ సాంబశివరావును డీఆర్‌డీఏగా బదిలీ చేశారు. మేడ్చల్ ఎక్సైజ్ అధికారి విజయభాస్కర్ వికారాబాద్ జిల్లా ఎక్సైజ్ అధికారిగా బదిలీ కాగా, ఆయన స్థానంలో నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన ఎక్సైజ్ అధికారి ఫయాజిద్దీన్‌ను నియమించారు. మల్కాజిగిరి ఎక్సైజ్ అధికారి అరుణ్‌కుమార్‌ను గద్వాల్ జిల్లాకు బదిలీ చేయగా, ఆయన స్థానంలో భువనగిరి–యాదాద్రి జిల్లాకు చెందిన ఎక్సైజ్ అధికారి నవీన్‌కుమార్ బదిలీపై వచ్చారు. జిల్లా పంచాయతీ శాఖ అధికారి రమణమూర్తిని వనపర్తి జిల్లాకు బదిలీ చేయగా, ఆయన స్థానంలో ములుగు జిల్లాకు చెందిన కొండ వెంకయ్యను డీపీఓగా బదిలీ చేశారు. డీపీఓ రమణమూర్తి పనితీరుపై ఇప్పటికే కలెక్టర్ సీరియస్‌గా ఉండగా, జిల్లా అదనపు కలెక్టర్(లోకల్‌బాడీ) అభిషేక్ అగస్త్య గతంలో ప్రభుత్వానికి సరెండర్ చేయాలని కోరినప్పటికీ, రాజకీయ పలుకుబడితో ఇక్కడే కొనసాగినట్లు తెలుస్తోంది.

మొదలైన లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ

- కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు జిల్లా అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఈ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకునే ఓటర్ల తుది జాబితాను విడుదల చేశారు. ఎన్నికల నిర్వహణ తీరుపై నియోజకవర్గ రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. కలెక్టరేట్లో మొదటి విడత ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం)ల తనిఖీ కొనసాగుతోంది.
- మల్కాజిగిరి పార్లమెంటు పరిధిలో ఏడు శాసనసభ నియోజకవర్గాలు ఉన్నాయి. కొద్ది రోజుల్లోనే పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో శాసనసభ నియోజకవర్గాల్లో ఈవీఎంల మొదటి విడత తనిఖీ ప్రక్రియ కొనసాగుతోంది. జిల్లా కలెక్టర్ గౌతమ్ అధ్వర్యంలో గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలు, వీవీ పాట్స్, కంట్రోల్, బ్యాలెట్ యూనిట్లు పరిశీలన కొనసాగుతోంది. ఈనెల 14 వరకు తొలి విడత ఈవీఎంల తనిఖీ పూర్తికానుంది. ఆ తర్వాత ఈవీఎంల ర్యాండమైజేషన్ కొనసాగుతుంది. ఈ విధానం ఎన్నికలు నిర్వహించే సమయానికి మూడు విడతలుగా చేపట్టనున్నారు. చివరకు ఎలాంటి లోపాలు లేని ఈవీఎంలను పోలింగ్ కేంద్రాలకు పంపిస్తారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీని అందరి సహకారంతో అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ వసుపతిప్రణీతాగౌడ్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని 4, 5, 6, 9వ వార్డుల్లో సుమారు రూ.80 లక్షల మున్సిపల్ నిధులతో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు, సీసీ రోడ్డుపనులను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ వార్డుల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ నరేందర్‌రెడ్డి, కమిషనర్ రాజమల్లయ్య, డీఈఈ చిరంజీవులు, కౌన్సిలర్లు కొత్త సురేఖభాస్కర్‌గౌడ్, గోగుల సరితావెంకటేష్, మంగళపురి వెంకటేష్, వరగంటి వెంకటేష్, బీఆర్‌ఎస్ నేతలు శ్రీకాంత్‌గౌడ్, భాస్కర్, తిరుపతిరెడ్డి కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు సన్మానం



ఎంపీడీఓను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

మేడ్చల్: బదిలీపై మేడ్చల్ నుంచి రంగారెడ్డి జిల్లాకు వెళ్లిన మండల పరిషత్ అభివృద్ధి అధికారి జె.పద్మావతిని ఘనంగా సన్మానించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు, మాజీ సర్పంచ్‌లు, వివిధ శాఖ అధికారులు, మండల పరిషత్ సిబ్బంది ఆమెను ఘనంగా సత్కరించి ఆమె సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, వైస్‌ఎంపీపీ గోపని వెంకటేషం, తహసీల్దార్ శైలజ, మాజీ సర్పంచ్‌లు గీతభాగ్యారెడ్డి, రాజమల్లారెడ్డి, ఎంపీఓలు రవి, వినూత్న, ఏఓ అర్చన, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

చేతి వృత్తిదారులకు చేయూత

డీసీసీ, డీఎల్‌ఆర్సీ సమావేశంలో కలెక్టర్ గౌతమ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: పద్దెనిమిది రకాల చేతి వృత్తుల వారికి పీఎం విశ్వకర్మ స్కీం ద్వారా ఆర్థిక సాయం అందించడం ద్వారా అంతరించిపోతున్న హస్తకళలకు జీవం పోసినట్టవుతుందని, ఈ స్కీమ్ కోసం దరఖాస్తు చేసుకునే లబ్ధిదారులు ఆధార్, రేషన్ కార్డులు జతచేసి గ్రామ పంచాయతీలో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జిల్లాలోని బ్యాంకర్లు, సంబంధిత అధికారులతో డీసీసీ, డీఎల్‌ఆర్సీ సమావేశాన్ని ఆయన నిర్వహించారు. ఇందులో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో ఈ దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి రాష్ట్రస్థాయిలో గుర్తింపు కార్డు అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. గుర్తింపు కార్డు పొందిన వారికి అవసరమైన ఉపకరణాలు పీఎం విశ్వకర్మ స్కీం ద్వారా మొదటి విడతగా రూ.50 వేలు అందజేస్తారని, తదుపరి అవసరమైన మేరకు రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు రుణం ఇస్తామన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి వార్షిక రుణ లక్ష్యం రూ.18,370 కోట్లు కాగా, రూ.44,287 కోట్లు మంజూరు చేసి 241 శాతంతో లక్ష్యాన్ని అధిగమించారన్నారు. లక్ష్య సాధనలో వెనుకబడిన బ్యాంకర్లు తమ పనితీరును మెరుగు పరచుకోవాలన్నారు. పట్టణ ప్రాంతమైన మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో యువతకు ఉన్నత విద్యా కోసం ఎక్కువ శాతం రుణాలు అందించడం ద్వారా ఉన్నత విద్యా ప్రమాణాలను పొంది వారి బంగారు భవిష్యత్తుకు మైలురాయి వేసుకోగలరన్నారు. రైతులకు పంట రుణాలు, టర్మ్ లోన్‌లు, వ్యవసాయ అనుబంధ రుణాలు విరివిగా అందించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పరిశ్రమలు, డీఆర్‌డీఓ తదితర శాఖల ద్వారా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు బ్యాంకులు ఉపాధి యూనిట్ల స్థాపన, చిన్న, మధ్య తరహా, విద్య, గృహ నిర్మాణం, ఇతర ప్రాధాన్యత రంగాలకు అర్హులైన పేద లబ్ధిదారులకు మంజూరు చేయాలని కలెక్టర్ కోరారు. కెనరా బ్యాంకు డీజీఎం సంజయ్ కుమార్, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసులు, ఆర్బీఐ ఎల్‌డీఓ గోమతి, నాబార్డ్ అధికారి రమేష్, జీఎండిఐసి రవీందర్, డీఆర్డీవో పద్మజారాణి, జిల్లా వ్యవసాయాధికారి మేరీ రేఖ, ఆయా బ్యాంకుల మేనేజర్లు, మెప్మా, ఎస్సీ కార్పొరేషన్, డీఐసీ, కేవీఐసీ, ఆర్బీఐ, నాబార్డుతో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో 149 అర్జీలు

మేడ్చల్ జిల్లాల ఆఫీసర్ చంద్రావతి



సాక్షి, మేడ్చల్ జిల్లా: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 149 అర్జీలను జిల్లా లా ఆఫీసర్ చంద్రావతి, డీఆర్‌డీఓ పద్మజారాణితో కలిసి స్వీకరించారు. ప్రజల అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన చేసి, వాటిని పరిష్కరించాలని లా ఆఫీసర్ చంద్రావతి సంబంధిత జిల్లా అధికారులను సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

భూగర్భ డ్రైనేజీ పనులకు శ్రీకారం



డ్రైనేజీ పనులకు భూమిపూజ చేస్తున్న వైస్ చైర్మన్ రెడ్యానాయక్

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని ఇస్మాయిల్‌ఖాన్‌గూడ, అన్నోజిగూడ ప్రాంతాల్లో డ్రైనేజీ పనులకు వైస్ చైర్మన్ నానావత్ రెడ్యానాయక్ సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుమారు రూ.40 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో 1, 2, 4వ వార్డుల్లో డ్రైనేజీ పనులు చేపట్టామన్నారు. అన్ని వార్డుల అభివృద్ధికి పోచారం పురపాలక మండలి కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ వేమనరెడ్డి, కౌన్సిలర్లు గొంగళ్ల మహేష్, చింతల రాజశేఖర్, ఏఈ నరేష్ కుమార్, బీఆర్‌ఎస్ పోచారం మున్సిపల్ వర్కింగ్ ప్రెసిడెంట్ గొంగళ్ల బాలేష్, కాలనీవాసులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.కోట్లు విలువ చేసే స్థలాన్ని కాపాడాలి

నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి



కలెక్టరేట్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్–291లో గల కోట్లాది విలువచేసే ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని సోమవారం నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగారం మున్సిపల్ ప్రధాన రహదారిలో గల సర్వే నంబర్–291లో సుమారు 2 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఎన్నికల సమయంలో కొంతమంది కబ్జాదారులు, రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై నిబంధనలకు విరుద్ధంగా 59 జీవో ప్రకారంగా అక్రమ రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని, ఈ అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని నవంబర్‌లోనే తాము కౌన్సిల్ సమావేశంలో తీర్మానించి జిల్లా కలెక్టర్‌కు అందజేశామన్నారు. అక్రమంగా ప్రభుత్వ స్థలాలను 59 జీవో కింద చేసుకున్న రిజిస్ట్రేషన్లను ఇటీవల ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. అయినా కొంత మంది కబ్జాదారులు మాత్రం విలువైన ప్రభుత్వ స్థలంలో యథేచ్ఛగా రాత్రిపూట నిర్మాణాలు చేపడుతున్నారని అధికారులకు విన్నవించారు. సుమారు రూ.70 నుంచి రూ.80 కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని కాపాడి భవిష్యత్‌లో మున్సిపల్ ప్రజలకు ఉపయోగపడే విధంగా ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించేందుకు కేటాయించాలని కోరారు. ఈ విషయంలో రెవెన్యూ ఉన్నతాధికారులు, ప్రభుత్వ పాలకులు స్పందించాలని కోరారు. కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి మనవరాలు త్రిశితరెడ్డికి జాతీయ స్థాయి నాట్య కళా పురస్కారం దక్కింది. నగరంలోని శిల్పకళా వేదికలో ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి శాస్త్రీయ, జానపద నృత్య వేడుకల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చిన త్రిశిత రెడ్డికి జాతీయ స్థాయిలో నాట్య విరించి పురస్కారం దక్కింది. సోమవారం ఆమెను ఎన్‌ఆర్‌సీఈ కళాశాలలో అభినందించారు.

నియామకం



మేడ్చల్: మేడ్చల్ మండల మున్నూరుకాపు మహిళా సంఘం అధ్యక్షురాలిగా మేడ్చల్‌కు చెందిన తోట వసంత నియమితులయ్యారు. మేడ్చల్‌లో నిర్వహించిన సమావేశంలో వసంతను మండల మహిళా కమిటీ అధ్యక్షురాలిగా వసంతను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రాంపల్లిలో శ్రీమల్లికార్జున స్వామి కల్యాణోత్సవం



కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లిలో సోమవారం శ్రీకేతకి భ్రమరాంబ సమేత శ్రీమల్లికార్జున స్వామి 68వ వార్షికోత్సవ ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భాగంగా శ్రీమల్లికార్జునస్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కౌన్సిలర్లు సరితారమేష్, నాగేష్‌గౌడ్, కళావతి, లక్ష్మీ, బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, కో ఆప్షన్ సభ్యుడు క్యాసారం అశోక్‌గౌడ్, నేతలు గండి అంజయ్యగౌడ్ పాల్గొన్నారు.

రేపు వసంత పంచమి శ్రీసరస్వతి హోమం

గౌతంనగర్: వసంత పంచమి పురస్కరించుకొని బుధవారం గౌతంనగర్ డివిజన్ శ్రీజయగిరి లక్ష్మీనర్సింహాస్వామి దేవాలయం ఆధ్వర్యంలో బాసరలో శ్రీసరస్వతి హోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు రఘుకిరాణాచార్యులు తెలిపారు.ఫోన్: 90007 60076.

సంస్కృతిని పరిరక్షించుకోవాలి



భరతనాట్యం స్కూల్ వార్షికోత్సవం

రాచకొండ డీసీపీ ఇందిరా

కీసర: సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాచకొండ కమిషనరేట్ డీసీపీ పి.ఇందిరా అన్నారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీలోని సాయిభవానీ ఫంక్షన్‌హాల్‌లో నదనలోగ భరతనాట్యం స్కూల్ డైరెక్టర్ లక్ష్మీప్రియ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన 10 వార్షికోత్సవ వేడుకలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూచిపూడి భరతనాట్యంలో చిన్నప్పటి నుంచి పిల్లలకు శిక్షణ ఇచ్చి వారిని ఉత్తమ కళాకారులుగా తీర్చిదిద్దేందుకు లక్ష్మీప్రియ చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పిల్లలు అన్నిరంగాల్లో రాణించాలని అభిలాషించారు. కార్యక్రమంలో రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ చీఫ్ కో ఆర్డినేటర్ సావిత్రి, మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మార్కండేయ స్వామి జయంతి



మేడ్చల్: మార్కండేయ జయంతిని మేడ్చల్‌లో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మార్కండేయ చిత్రపటం వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించి అనంతరం పూలమాలలు వేశారు. జయంతి సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం సభ్యులు పాల్గొన్నారు.



శామీర్‌పేట్: శివభక్త మార్కండేయ స్వామి జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. శామీర్‌పేట పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో భక్త మార్కండేయస్వామి ఆలయంలో ఉదయం అభిషేకంతో పూజలు ప్రారంభమయ్యాయి. శివభక్త మార్కండేయ స్వామికి అర్చన, మంగళహారతి నిర్వహించి తీర్థప్రసాదాలను భక్తులు స్వీకరించారు. శామీర్‌పేట ఎల్లుబాయి, జెడ్పీటీసీ అనిత, పద్మశాలి సంఘం సభ్యులు, పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.